క్లుప్తంగా

ప్రారంభమైన పవిత్రోత్సవాలు



పారిజాతగిరిలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. వార్షిక పవిత్ర ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమైనట్లు ఈవో కలగర శ్రీనివాస్ తెలిపారు. 16వ తేదీ మంగళవారం సాయంత్రం విశ్వక్సేనపూజ, పుణ్యావచనం, అంకురార్పణతో తదితర పూజలు పోణంగి పవన్ కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఈవో తెలిపారు. ఆలయ అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు, రిషికేశ్ ఆచార్యులు, కుమార్ ఆచార్యులు, రాఘవాచార్యులు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు.

25న అయ్యప్ప ఆలయంలో పూజలు



జంగారెడ్డిగూడెం: ఈ నెల 21వ తేదీ గుర్వాయిగూడెం అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ తెలిపింది. స్వామివారి జన్మనక్షత్రమైన ఉత్తరా నక్షత్రం సందర్భంగా స్వామి వారికి మండపారాధన, పుణ్యాహవచనం, మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమం, నీరాజనం, మంత్రపుష్పాలు, అనంతరం అన్న సమారాధన నిర్వహిస్తామన్నారు. కావున భక్తులు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఈ పూజా కార్యక్రమంలో పాల్గొనవలసిన వాళ్లు ముందుగా మీ గోత్ర నామాలు రూ.316 చెల్లించి నమోదు చేయించుకోవాలన్నారు. అలాగే అన్నసమారాదన నిర్వహించాలనుకునే వారు రూ.5 వేలు చెల్లించాలన్నారు. ఇతర వివరాలకు 6305982909 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు



జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం శ్రీహరి హరసుత అయ్యప్ప స్వామి దేవాలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక



పార్టీ అధినేతతో బీవీఎస్ రెడ్డి, నేతలు

లింగపాలెం: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు పార్టీ నేత భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి (బీవీఎస్ రెడ్డి) తెలిపారు. ఈ మేరకు లింగపాలెంలో ఒక ప్రకటన విడుదల చేశారు.

నేత్రపర్వం.. శివ కల్యాణం



ఉత్సవ మూర్తులపై తలంబ్రాలు పోస్తున్న అర్చకుడు

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీభ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయంలో శివదేవుని కల్యాణ మహోత్సవం మంగళవారం నేత్రపర్వంగా నిర్వహించారు. ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని వైభవంగా నిర్వహించిన ఈ వేడుకలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ముందుగా అర్చకులు మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఒక వేదికపై ఉంచి కల్యాణం నిర్వహించారు.

భారీ అన్నసమారాధన

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం అశ్వారావుపేట రోడ్‌లో ఉన్న సుందర బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయం వద్ద మంగళవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ అన్నప్రసాద వితరణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ దాతల సహకారంతో ప్రతి మంగళవారం అన్నప్రసాద వితరణ చేస్తున్నట్లు తెలిపారు. దాతలు యశోద శ్రీకాంత్, లక్ష్మీతులసి, కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు కర్రి శ్రీరామ రెడ్డి దంపతులు, గండికోట బాబి పాల్గొన్నారు.

పాతాళకుంట వాగు ప్రక్షాళన ఎప్పుడో?

- దుర్వాసనతో ప్రజల ఇబ్బందులు
- భరించలేకపోతున్నామంటూ ఆవేదన

లింగపాలెం: ధర్మాజీగూడెంలో ఇళ్ల మధ్యలో ఉన్న పాతాళకుంటలో మురుగు నీటితో పాటు వర్షపు నీరు నిల్వ ఉండి, ఒక వైపు దుర్వాసన మరో వైపు దోమల మయంతో భరించలేకపోతున్నామంటూ ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో అధికంగా వర్షం పడితే వాగు పొంగి ఇళ్లలోకి నీరు వచ్చే ప్రమాదం ఉంది. వర్షపు నీటితో పాటు మురుగు నీరు కూడా బయటకు పోయే మార్గం లేకుండా పోయింది. ఈ వాగు ఒక వైపు గుర్రపుడెక్కతోనూ, మరో వైపు పూడికతో నిండి ఉంది. దీంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామం మధ్యలో ఉన్నా ఈ పాతాళ కుంట కాలువ ద్వారా నీరు ఎర్ర చెరువులోకి వెళుతుంది. అనేక పర్యాయాలు పంచాయతీ వారు ఈ కాలువలో పూడిక తీశారు. అయినా ఈ కాలువ తరచూ పూడికతో నిండి నీరు నిల్వ ఉంటుంది. ఇది గుర్రపుడెక్కతో పూర్తిగా అలుముకొని ఉంది. దీనికి తోడు ఇళ్లలో వాడకం నీరు చేరి దోమలతో పాటు తీవ్ర దుర్గంధం వెదజల్లుతుంది. దీంతో అంటు వ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలంలో కాలువ పొంగి ఆ నీరు సుమారు 100 ఇళ్లను ముంచెత్తుతోంది. దీంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీరి కష్టాలు వర్ణనాతీతం. గతంలో ఈ కాలువను మరమ్మతులు చెపట్టేందుకు అనేక సార్లు జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు వచ్చి చూసి వెళ్లారే తప్పా ఇంత వరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువ పనులకు సుమారు రూ.35 లక్షలు వరకు అవసరమవుతాయని అధికారులు అంచనాలు కూడా వేశారు. అయినా ఫలితం మాత్రం శూన్యం. కాలువకు ఇరు వైపులా గోడలు నిర్మించి, అడుగు భాగంలో ఫ్లోరింగ్ చేయించి వర్షాకాలంలో కాలువలో నీరు ఇళ్లను ముంచెత్తకుండా చూడాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.ఈ గ్రామానికి చెందిన వ్యక్తే ఎమ్మెల్యే కావడతంతో ఇప్పుడైన ఏళ్లతరబడి ఉన్న సమస్యకు మోక్షం లభిస్తుందేమోనని ఈ ప్రాంత ప్రజలు అత్రుతగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా సంబధిత అధికారులు ఈ సమస్యపై ప్రత్యేక శ్రద్ధ చూపి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



పూడిపోయిన పాతాళకుంట కాలువ



పాతాళకుంట వాగులో అలుముకున్న గుర్రపుడెక్క

పాతాళకుంట వాగుకు రివిట్‌మెంట్ కట్టాలి



పంచాయతీ వారు పూడిక తీస్తున్నప్పటికీ తరచూ పాతాళకుంట కాలువ పూడిక పోకుండా శాశ్వతంగా అడుగు భాగంలో సిమెంట్ చేసి, సైడ్ గోడలకు రివిట్‌మెంట్ కట్టాలి. కాలువలో నీరు బయటకు వెళ్లకపోవడంతో దోమలతో పాటు తీవ్ర దుర్గంధం వెదజల్లుతుంది. అంటు వ్యాధులు ప్రబలుతాయేమోనని భయపడుతున్నాం. వర్షాకాలంలో కాలువ పొంగి నీరు ఇళ్లలోకి ప్రవేశిస్తుంది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పూర్తి స్థాయిలో కాలువ పనులకు ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలి.

–ఎస్.శ్రీను, ధర్మాజీగూడెం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చింతలపూడి: ఈ నెల 17వ తేదీ బుధవారం సీతానగరం సబ్ స్టేషన్ పరిధిలో ఊట సముద్రం ఏజీఎల్ ఫీడర్, శంకు చక్రపురం సబ్ స్టేషన్ పరిధిలో సత్య సాయి ఫీడర్, వెలగలపల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఫాతిమపురం ఏజీఎల్ ఫీడర్లకు ఆర్‌డీఎస్‌ఎస్ పనుల నిమిత్తం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా ఫీడర్ల పరిధిలో గల గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. కావున ఆయా ఫీడర్ల పరిధిలో గల విద్యుత్ వినియోగదారులు విద్యుత్ శాఖ వారికి సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

లింగపాలెం: మండలంలోని ధర్మాజీగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని కేఆర్ పాలెం–1 ఫీడర్‌కు ఈ నెల 17వ తేదీ బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు. ఆర్‌డీఎస్‌ఎస్ పనులు జరుగుతున్నందున ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేవీఆర్ పాలెం–1 ఫీడర్ పరిధిలోని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయడం సిగ్గుచేటు



బొడ్డు వెంకటేశ్వర్రావు

చింతలపూడి: రాష్ట్రంలో మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయడం సిగ్గుచేటని జిల్లా వైఎస్సార్ సీపీ మున్సిపల్ విభాగం అధ్యక్షుడు బొడ్డు వెంకటేశ్వరరావు విమర్శించారు. మంగళవారం చింతలపూడిలో విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేద బడుగు బలహీన వర్గాల, మధ్య తరగతి వర్గాలకు చెందిన విద్యార్థులు డాక్టర్ కోర్స్ చదవడానికి పడుతున్న ఇబ్బందులను దష్టిలో పెట్టుకొని రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో మెడికల్ కళాశాలకు శ్రీకారం చుట్టారన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలోనే ఐదు మెడికల్ కళాశాలలను పూర్తి చేశారని మిగిలినవి నిర్మాణంలో ఉన్నాయన్నారు . వాటిని పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వానికి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించి బడుగు బలహీన వర్గాలు ఉన్నత చదువులు చదవకుండా అడ్డుకుంటుందని విమర్శించారు.

మండల పరిషత్ సమావేశం వాయిదా

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మళ్లీ వాయిదా పడింది. ఈ నెల 2వ తేదీన సమావేశం ఏర్పాటు చేయగా ఎంపీటీసీలు హాజరుకాకపోవడంతో కోరం లేక సమావేశం వాయిదా పడింది. అయితే మళ్లీ సమావేశాన్ని 16వ తేదీ మంగళవారం ఏర్పాటు చేయగా ఈ సమావేశానికి సర్పంచ్‌లు, అధికారులు హాజరయ్యారు. అయితే ఎంపీటీసీలు హాజరుకాకపోవడంతో మళ్లీ సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఈఎస్ఎస్ శ్రీనివాస్ తెలిపారు.

నేడు విశ్వకర్మ యజ్ఞోత్సవం

కొయ్యలగూడెం: శ్రీవిశ్వకర్మ యజ్ఞోత్సవం బుధవారం నిర్వహిస్తున్నట్లు శ్రీకంచి కామాక్షి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం పేర్కొంది. వెంకయ్యపాలెం (గవరవరం) వెళ్లే రోడ్డులోని శ్రీకంచి కామాక్షి పీఠం వద్ద ఉదయం 9 నుంచి యజ్ఞోత్సవం, అన్నసమారాధన ఏర్పాటు చేశామన్నారు.

జీవన ఎరువులతో అధిక దిగుబడులు



కొయ్యలగూడెం: రైతులకు సూచనలు చేస్తున్న అధికారులు



లింగపాలెం: పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

కొయ్యలగూడెం: జీవన ఎరువులు వాడితే అధిక దిగుబడులు సాధ్యమని వ్యవసాయాధికారులు తెలిపారు. బోడిగూడెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి కేవీఎస్ పోసరావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారులు రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ ఉద్యాన శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

లింగపాలెంలో పొలం పిలుస్తోంది

లింగపాలెం: మండలంలోని ఆశన్నగూడెం, ముడిచర్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయాధికారులు మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి.ప్రదీప్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ పంటలు సాగు చేసే రైతులు తప్పనిసరిగా ఈ–పంట నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ముడిచర్ల గ్రామ సర్పంచ్ రావి వెంకటేశ్వరరావు, ఆశన్నగూడెం మోదుగు నాగేశ్వరరావు, మామిడిపల్లి నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కామేశ్వరి బాధ్యతల స్వీకరణ



ఎంపీడీవో కామేశ్వరి

చింతలపూడి: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కేపీ కామేశ్వరి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్ పరిపాలనాధికారిగా పనిచేస్తున్న కామేశ్వరిని పదోన్నతిపై ఎంపీడీఓగా నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద ప్రజలకు చేరవేయడంలో కృషి చేస్తానని తెలిపారు.

డీఎల్‌పీవో బాధ్యతల స్వీకరణ



సుబ్బరాయన్

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం డీఎల్‌పీవోగా సుబ్బరాయన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సుబ్బరాయన్ ఇప్పటి వరకు ద్వారకాతిరుమల మండలం డిప్యూటీ ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించారు. పదోన్నతిపై జంగారెడ్డిగూడెం డీఎల్‌పీవోగా ఆయన నియమితులయ్యారు.

రహదారుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు

టి.నరసాపురం: మండలంలో అధ్వానంగా ఉన్న రోడ్ల అభివృద్ధికి అధికారులు చర్యలు చేపట్టాలని జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు (సూరిబాబు) సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ దార బోయిన లక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు వారి ప్రగతి నివేదికలను వివరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన సూరిబాబు మాట్లాడుతూ మండలంలో ప్రధానంగా రోడ్ల సమస్య వలన ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాటి అభివృద్ధికి అధికారులు ప్రణాళికలు రూపొందించాలని కనీసం తాత్కాలిక మరమ్మతులైనా వెంటనే చేపట్టాలని ఆర్అండ్‌బీ ఏఈకి సూచించారు. వాతావరణ పరిస్థితులను బట్టి గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు పరచాలన్నారు. ఎక్కడికక్కడ చెత్తాచెదారం లేకుండా తొలగించి దోమల మందు పిచికారీ చేయలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.నగరాజకుమారి, తహసీల్దార్ టి.సాయిబాబా ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆయుధ కర్మాగార డిపోకు వ్యతిరేకంగా సమావేశం



నినాదాలు చేస్తున్న వామపక్ష నాయకులు

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం వంకవారిగూడెంలో మంగళవారం వామపక్షాలు, పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సీపీఎం నాయకులు తెల్లం దుర్గారావు ఇంటివద్ద రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయుధ కర్మాగార డిపో ఏర్పాటును వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. గతంలో ఆయుధ డిపో ఏర్పాటును వ్యతిరేకిస్తూ తీర్మానం కూడా చేసినట్లు నాయకులు తెలిపారు. మళ్లీ ఏర్పాటు చేయాలని చూస్తే ఏకతాటిపై ఉంటూ వ్యతిరేకిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు, ఎస్.రామ్మోహన్, ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు మడకం వెంకటేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ, సీపీఎం నాయకులు తెల్లం దుర్గారావు, సరిపెళ్ల అప్పారావు, కొల్లూరి దావీద్, తెల్లం సంకురుడు, తెల్లం అబ్బులు, న్యూడెమోక్రసీ నాయకులు తగరం బాబూరావు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రోటరీ సర్వసభ్య సమావేశం

జంగారెడ్డిగూడెం: రోటరీ క్లబ్ జంగారెడ్డిగూడెం ప్రెసిడెంట్ పెనుమర్తి సురేష్‌బాబు, సెక్రెటరీ సంధ్య ప్రవల్లిక గార్ల ఆధ్వర్యంలో శ్రీ మల్లాది సీతా రామలింగేశ్వర రోటరీ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కూరగాయల కమీషన్ వర్తకులు సింగంశెట్టి హరిబాబు రోటరీ నూతన సభ్యులుగా చేరినట్లు రోటరీ అధ్యక్షుడు సురేష్‌బాబు తెలిపారు.

ఆదివాసీలపై దౌర్జన్యానికి ఖండన

కుక్కునూరు: ఆదివాసీ వ్యక్తికి చెందిన పట్టా భూమిలో జామాయిల్ మొద్దులు తీస్తుండగా అమరవరం అటవీ రేంజ్ అధికారి దౌర్జన్యంగా వాహనాన్ని స్వాధీనం చేసుకోవడాన్ని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కూరం సంజీవరావు తీవ్రంగా ఖండించారు. మంగళవారం రెడ్డిగూడెంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దామరచర్ల రెవెన్యూ పరిధిలో రెడ్డిగూడెం గ్రామానికి చెందిన సరియం సావిత్రి తన భూమిలోని జామాయిల్ మొద్దులు తీస్తుండగా ఆ భూమి అటవీ శాఖ పరిధిలోకి వస్తుందంటూ డోజర్‌ను దౌర్జన్యంగా రేంజ్ కార్యాలయానికి తీసుకెళ్లారని ఆరోపించారు. ఆదివాసీలపై దౌర్జన్యంగా వ్యవహరించిన రేంజ్ అధికారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై అమరవరం ఫారెస్ట్ రేంజ్ అధికారిని వివరణ కోరగా.. జామాయిల్ మొద్దులు తీస్తున్న భూమిపై అనుమానంతో ఆరా తీశామన్నారు. సాధారణ చెట్లనూ పక్కకు తోసేయడం గుర్తించి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అది రెవెన్యూ పరిధిలోని భూమి అని ఆ శాఖ అధికారులు నిర్ధారిస్తే వాహనాన్ని వదిలేస్తామని, లేదంటే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

పురుగు మందుల షాపుల తనిఖీ



పురుగు మందుల షాపులను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

వేలేరుపాడు: మండలంలోని ఎరువులు, పురుగు మందుల షాపులను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హబీబ్‌బాషా మంగళవారం తనిఖీ చేశారు. వేలేరుపాడు మండల కేంద్రంలో రెండు పురుగుమందుల షాపుల్లో ఎరువులు, పురుగు మందులను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. యూరియా గోడౌన్లలో యూరియా బస్తాలు కొంత మేరకు తడిగా ఉన్నాయని, వాటిని తడవకుండా చూసుకోవాలని, షాపుల యజమాలను కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీఏ బుజ్జిబాబు, ఏవో గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు ప్రాధాన్యం



తహసీల్దార్‌కు వివరాలు తెలుపుతున్న వైద్యాధికారులు

కొయ్యలగూడెం: మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇవ్వడానికి స్వాస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని రూపొందించినట్లు కొయ్యలగూడెం, బయ్యన్నగూడెం పీహెచ్‌సీల వైద్యాధికారులు మంగళవారం పేర్కొన్నారు. కుటుంబంలో మహిళల పాత్ర చాలా కీలకమని, మహిళలు ఆరోగ్యం గా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. ఈ భావంతోనే మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు గ్రామాల్లో మహిళలకు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వైద్యులు వి.సత్యనారాయణ, తస్లీమ నస్రిన్లు తెలిపారు. కార్యక్రమం గురించి వైద్యాధికారులు తహసీల్దార్‌తో చర్చించారు.

రజత వస్త్రానికి రూ.5,01,116 విరాళం



దాతలను అమ్మవారి చిత్రపటంతో సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ అమ్మవారి రజత వస్త్రం తయారీ పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ (పండు) తెలిపారు. మంగళవారం ఆలయంలో అమ్మవారికి నిత్య కైంకర్యాలు అర్చకులు కె.శంకర్ మహేష్ శర్మ నిర్వహించారు. అమ్మవారికి వెండి చీర నిమిత్తం జంగారెడ్డిగూడెంకు చెందిన దివంగత డాక్టర్ జంగా బాబూ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, జంగా కుటుంబరెడ్డి కుటుంబసభ్యులు రూ. 5,01,116లు సమర్పించినట్లు రాజాన పండు తెలిపారు. దాత జంగా నారాయణరెడ్డి కుటుంబసభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించినట్లు తెలిపారు.

ఘనంగా ప్రపంచ ఓజోన్ దినోత్సవం



ఓజన్ ఆవశ్యతకను విద్యార్థులకు వివరిస్తున్న దృశ్యం

లింగపాలెం: సింగగూడెం మోడల్ ప్రైమరీ పాఠశాలలో మంగళవారం ప్రపంచ ఓజోన్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఓజోన్ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. సూర్యుని నుంచి వచ్చే హానికరమైన అతి నీలలోహిత కిరణాల నుంచి ఓజోన్ పొర మనలను కాపాడుతుందని తెలిపారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం పువ్వుల అంజనేయులు, అప్పారావు, ఎం.రేఖ పాల్గొన్నారు.

జోరు వానతో ప్రజల ఇక్కట్లు



వర్షపు నీటిలో నుంచి వెళుతున్న వాహనాలు

ద్వారకాతిరుమల: క్షేత్రంలో మంగళవారం జోరుగా వర్షం కురిసింది. దీంతో పలు ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా స్థానిక జెర్సీ పార్లర్ ఎదురుగా, అలాగే గొల్లగూడెం, పంగిడిగూడెం వద్ద ప్రధాన రహదారిపై వర్షపు నీరు భారీగా నిలిచిపోయింది. శ్రీవారి దర్శనార్థం పలు ప్రాంతాల నుంచి క్షేత్రానికి ద్విచక్ర వాహనాలపై వెళుతున్న భక్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

జంగారెడ్డిగూడెం: చింతలపూడి నియోజకవర్గ నాయీ బ్రాహ్మణ సేవా సంఘ కార్యవర్గ సమావేశం మంగళవారం నిర్వహించారు. చిప్పాడ నరసింహారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలపై చర్చించారు. కార్యక్రమంలో సంఘ నేతలు కొప్పెర్ల నాగరాజు, కొప్పాక సత్యనారాయణ, నందిగం వెంకట సుబ్బారావు, చెడే నాగరాజు, వెంకటాచలం తాడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మద్దిలో ప్రత్యేక పూజలు



జంగారెడ్డిగూడెం: స్వయంభు శ్రీమద్ది ఆంజనేయస్వామి ఆలయం వద్ద మంగళవారం తెల్లవారు జామున ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రభాత సేవ, నిత్యార్చన పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. మంగళవారం మధ్యాహ్నం వరకు దేవస్థానానికి పలు సేవలు, విరాళాల ద్వారా రూ.1,67,297 సమకూరినట్లు ఈవో తెలిపారు.